న్యూస్ బాక్స్

నాగ్‌పూర్ వందే భారత్ రైలు కోచ్‌ల తగ్గింపు

పెద్దపల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): నాగ్‌పూర్ నుంచి సికింద్రాబాద్‌కు అక్కడి నుంచి నాగ్‌పూర్‌కు నడుస్తున్న వందే భారత్ రైలు నంబర్ 20101/02 కోచ్‌లను ఈ నెల 19వ తేదీ నుంచి తగ్గిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మార్గం గుండా వందే భారత్ రైలును గత ఏడాది సెప్టెంబర్‌లో ఆరంభించారు. గడిచిన ఐదు మాసాల్లో నాగ్‌పూర్ నుంచి సికింద్రాబాద్‌కు వచ్చినప్పుడు 33.81 శాతం, సికింద్రాబాద్ నుంచి నాగ్‌పూర్‌కు వెళ్లినప్పుడు 33.87 శాతం మంది ప్రయాణికులు మాత్రమే ప్రయాణించారు. ఈ రైళ్లలో ప్రయాణించాలంటే చార్జీలు ఎక్కువగా ఉండడంతో పాటు ఇదే మార్గంలో రాజధాని, దురంతో ఎక్స్‌ప్రెస్‌లు నడవడం, సమయంలో పెద్దగా తేడా లేదు. అలాగే పెద్దపల్లి, మంచిర్యాల, సిర్పూర్ కాగజ్‌నగర్ స్టేషన్లలో హాల్టింగ్ సౌకర్యం లేకపోవడంతో వందే భారత్ రైలుకు పెద్దగా ఆదరణ లభించలేదు. దీంతో 20 కోచ్‌ల నుంచి 8 కోచ్‌లకు తగ్గించినట్లు తెలుస్తున్నది. ఇప్పటికైనా దక్షిణ మధ్య రైల్వే అధికారులు స్పందించి పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, సిర్పూర్ కాగజ్‌నగర్ స్టేషన్లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆక్సిజన్ సిలిండర్ల సరఫరాకు ఆహ్వానం

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆక్సిజన్ బీ టైపు సిలిండర్లు సరఫరా చేయడానికి సంబంధిత అర్హత గల దుకాణదారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సూపరింటెండెంట్ దయాల్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు టెండర్ పద్ధతిన కోటేషన్లు ఈ నెల 17న మధ్యాహ్నం లోపు కార్యాలయంలో అందజేయాలని, సాయంత్రం టెండర్లు ఓపెన్ చేయనున్నట్లు తెలిపారు.

- పర్సనల్ ఇన్‌చార్జీలతో కొనసాగనున్న పాలక వర్గాలు
- సంఘాల పునర్విభజన నేపథ్యంలోనే పొడిగింపు
- పొడిగింపుపై కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో అసంతృప్తి



సహకార సంఘాల పదవీ కాలం పొడిగింపు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల పదవీ కాలం ఆరు మాసాలు పొడిగిస్తూ ప్రభుత్వం జీఓ ఆర్‌టీ నంబర్ 74 ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. సహకార సంఘాల పాలకవర్గాలు పర్సన్ ఇన్‌చార్జీలుగా కొనసాగనున్నారు. సహకార సంఘాలను విస్తరించాలని, ప్రతీ మండలంలో కనీసం రెండు సంఘాలు ఉండే విధంగా పునర్విభజన చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో కొత్తగా ఏడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని జిల్లా సహకార శాఖాధికారులు ప్రభుత్వానికి ప్రతిపాద నలు పంపించారు. ఈ నేపథ్యంలో కొత్త సంఘాల ఏర్పాటు, ఓటర్ల జాబితా తయారీ, కొత్త జిల్లాల ప్రాతిపదికన జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)లను ఏర్పాటు చేయాల్సి ఉన్నందున పదవీ కాలాన్ని పొడిగించాలని సహకార సంఘాల చైర్మన్లు ప్రభుత్వానికి విన్నవించారు. ఈ నేపథ్యంలో ఈనెల 14న ముగియాల్సిన వారి పదవీ కాలాన్ని ఆరు మాసాల పాటు పొడిగిస్తూ శుక్రవారమే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే సహకార సంఘాల పదవీ కాలాన్ని పొడిగించడంపై కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

● కొత్తగా మరో ఏడు సంఘాల ప్రతిపాదనలు..

ప్రతీ మండలానికి రెండు సహకార సంఘాలు ఉండేలా చర్యలు తీసుకునేందుకు రీ ఆర్గనైజేషన్ చేయా లని కేంద్ర ప్రభుత్వం ఆదేశించిన మేరకు జిల్లాలో కొత్తగా ఏడు సంఘాల ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రామగిరి, పాలకుర్తి, అంతర్గాం, మంథని మండలం వెంకటాపూర్, గుంజప డుగు, ఓదెల మండలం కొలనూర్, మరొక సంఘం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వానికి జిల్లా అధికారులు ప్రతిపాదనలు పంపించారు. దానిపై ఇప్పటి వరకు స్పష్టత రాలేదు. కొత్త సంఘాల ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిన తర్వాత ఆయా సంఘాల పరిధిలో ఉన్న రైతులను కొత్త సంఘంలో చేర్చి కొత్తగా సభ్యత్వాలను తీసుకుని, ఓటర్ల జాబితాలు డైరెక్టర్ల వారీగా రూపొందించాల్సి ఉంటుంది. ఈ తంతు పూర్తి కావడానికి నాలుగైదు నెలలైనా పడుతుంది. అలాగే గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలను నిర్వహిస్తే గానీ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేదు. దీంతో రైతులకు విస్తృత సేవలు అందించాల్సి ఉంటుంది. ప్రధానంగా ఈ యాసంగి సీజన్‌లో పండిస్తున్న ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ప్రత్యేక అధికారులను నియమించడం వల్ల ఇబ్బందులు తలెత్తనున్నాయని భావించిన ప్రభుత్వం సహకార సంఘాలు, డీసీసీబీ చైర్మన్ల విన్నపాలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న సహకార సంఘాల పదవీ కాలాన్ని మరో ఆరు మాసాల పాటు పొడిగించింది.

● జిల్లాలో 20 సహకార సంఘాలు..

జిల్లాలో ప్రస్తుతం 20 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల్లో 52,316 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. ఈ సంఘాల ద్వారా రైతులకు పంట రుణాలతో పాటు దీర్ఘకాలిక, బంగారం తాకట్టు, వాహన, ఇతర రుణాలు అందజేస్తున్నారు. అలాగే ఎరువులు, క్రిమిసంహారక మందులు, విత్తనాల విక్రయాలు చేపడుతున్నారు. రైతులు పండించిన పంట ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు జిల్లాలో 250కి పైగా కొనుగోలు కేంద్రాలను ప్రతీ సీజన్‌లో ఏర్పాటు చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలను నిర్వహించడం వల్ల కమీషన్ రూపేణా యేటా 12 కోట్ల రూపాయలు సహకార సంఘాలకు పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్ ద్వారా ఆదాయం సమకూరుతున్నది. ఈ డబ్బులు సంఘం అభివృద్ధికి దోహద పడుతున్నాయి. వాణిజ్య బ్యాంకులు రైతులకు పంట రుణాలు ఇవ్వనప్పుడు సహకార సంఘాల ద్వారానే పంట రుణాలు ఇచ్చేవాళ్లు. ఆయా సహకార సంఘాల్లో అక్రమాలు, అవకతవకలు, నిధుల దుర్వినియోగం జరగడంతో నష్టాల పాలయ్యాయి. దీంతో జిల్లాలో కొన్ని సంఘాలు మూతపడ్డాయి. ప్రస్తుతం ఉన్న సంఘాల్లో జవాబుదారీ తనం, పారదర్శకత పెరగడంతో నిధుల దుర్వినియోగం తగ్గుముఖం పట్టింది.

● పొడిగింపుపై కాంగ్రెస్ వర్గాల గుస్సా..

ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాల

మిగతా 8వ పేజీలో...

మాదకద్రవ్యాల నియంత్రణకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వేణు

పెద్దపల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ డి వేణు అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో మాదకద్రవ్యాల నియంత్రణపై జిల్లాస్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యా సంస్థలలో యాంటి డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేయాలని, డ్రగ్స్, ఇతర మాదక ద్రవ్యాల అలవాటు ఉన్న వారిని గుర్తించి పునరావాస కేంద్రాల ద్వారా మానిపించాలన్నారు. విద్యా సంస్థల్లో తల్లిదండ్రులతో నిర్వహించే సమావేశాల్లో డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలు, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలుగా మారితే వచ్చే పరిణామాల గురించి వివరించాలన్నారు. మాదక ద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి చికిత్స, కౌన్సెలింగ్‌పై చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్య శాఖ అధికారులకు సూచించారు. గోదావరిఖని ఆసుపత్రిలో 10 పడకల డీ అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. గంజాయి విక్రయాలపై నిఘా పెంచాలన్నారు. ఏసీపీలు క్రిష్ణ, రమేష్, జిల్లా అటవీ అధికారి శివయ్య, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి మహిపాల్‌రెడ్డి, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థికి అపార్ నంబర్ కేటాయించాలి

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరికి ఆధార్ నంబర్ ఎంత ముఖ్యమో విద్యార్థి అపార్ నంబర్ అంతే ముఖ్యమని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఏపీఏఆర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆటోమేటెడ్ పర్మినెంట్ అకౌంట్ రిజిస్ట్రీ(ఏపీఏఆర్)నంబర్ ద్వారా విద్యార్థుల ద్యార్హత సర్టిఫికెట్లు ఆన్‌లైన్‌లో భద్రపరుస్తామని, విద్యార్థులకు సంబంధించిన సమగ్ర రికార్డులు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రతీ విద్యార్థికి ఏపీఏఆర్ నంబర్ జనరేట్ చేయాలని, జిల్లాలో ఇప్పటివరకు 54శాతం నమోదు చేయడం జరిగిందని, మరో రెండు, మూడు రోజుల్లో 75శాతం చేరేలా అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కుల గణన సర్వేకు దరఖాస్తు చేసుకోవాలి

కోల్‌సిటీ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల గణన సర్వేలో పాల్గొనని కుటుంబాలు ఆదివారం నుంచి 28వరకు నిర్వహించే సర్వేలో పాల్గొనాలని కమిషనర్ అరుణశ్రీ ఒక ప్రకటనలో కోరారు. ఇండ్ల తాళాలు వేసిన వారు, సర్వేలో పాల్గొనని వారు, కార్పొరేషన్ కార్యాలయంలో ఆదివారం నుంచి నిర్వహించే ప్రజాపాలన సేవా కేంద్రంలో కుటుంబ సర్వేకు దరఖాస్తులు సమర్పించాలని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.

కంప్యూటర్ విద్యతోనే యువత భవిష్యత్తుకు బాటలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఎలిగేడు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువత కంప్యూటర్ విద్యలో నైపుణ్యం పెంచుకొని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండల కేంద్రంలోని నానేస్తం చారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో అర్షనపల్లి నర్సింగరావు స్మారక ఉచిత కంప్యూటర్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 1987-88లో పదో తరగతి చదివిన విద్యార్థులు ట్రస్ట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సేవా కార్యక్రమాలకు తన వంతుగా ట్రస్ట్‌కు రూ.50 వేలు విరాళంగా అందిస్తున్నట్లు ప్రకటించారు. కంప్యూటర్ శిక్షణకు అయ్యే ఖర్చులను ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు చెల్లిస్తున్నారు. ట్రస్ట్ అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణగౌడ్, సభ్యులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ వెంకటేశ్వర్‌రావు, నాయకులు రాజనర్సు, సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, పర్శరాంగౌడ్, తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

ఇసుక రవాణా నిలిపివేస్తామని

నిరంతర సరఫరాకు అనుమతి

- ఇచ్చిన హామీని అమలు చేయని ఎమ్మెల్యే
- విలేకరుల సమావేశంలో పుట్ట మధు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పుట్ట మధు

మంథని, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మంథని నియోజకవర్గంలో ఇసుక లారీలు బంద్ చేయిస్తానన్న ఎమ్మెల్యే మాట ఏమైందని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ప్రశ్నించారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 24 గంటల ఇసుక పాలసీని తీసుకురావడం దారుణమన్నారు. దీనికి ఎమ్మెల్యే మద్దతు ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే గల్లీ నుంచి ఢిల్లీ వరకు నాయకులు ఒకే విధంగా ఉంటూ ప్రజలను మోసం చేస్తుంటారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రెండు రోజుల్లో ఇసుకల లారీలు బంద్ చేయిస్తామని మాట ఇచ్చి ఎమ్మెల్యే నేడు ఇసుక తరలింపుపై ఎందుకు స్పందించడం లేదన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకే ఇసుక రవాణాకు అనుమతులు ఉండగా కాంగ్రెస్ ప్రభుత్వం 24 గంటలు ఇసుక రవాణాకు అనుమతులు ఇవ్వడాన్ని ప్రజలు గమనించాలన్నారు. పెద్దపల్లి, భూపాలపల్లి ప్రాంతాల నుంచి ఇసుక లారీలు వెళ్ళకుండా ఎమ్మెల్యేలు చర్యలు తీసుకున్నారన్నారు. మంథని ఎమ్మెల్యే ఎందుకు ఆలోచించడం లేదన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. తగరం శంకర్ లాల్, మాచీడి రాజుగౌడ్, ఏగోళపు శంకర్‌గౌడ్, కాయితీ సమ్మయ్య, బెల్లంకొండ ప్రకాష్‌రెడ్డి, పుప్పాల తిరుపతి, కాయితీ సమ్మయ్య, పెగడ శ్రీను, వేల్పుల గట్టయ్య, ఓదెలు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి

రీచ్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి ● రీచ్‌లను తనిఖీ చేసిన మైనింగ్ శాఖ కార్యదర్శి, కలెక్టర్



ఇసుక రీచ్‌లను పరిశీలిస్తున్న రాష్ట్ర మైనింగ్ శాఖ కార్యదర్శి ఎన్.శ్రీధర్, కలెక్టర్ శ్రీహర్ష

ముత్తారం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని, అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని రాష్ట్ర మైనింగ్ శాఖ కార్యదర్శి ఎన్.శ్రీధర్ అన్నారు. శనివారం జిల్లాకు వచ్చినఆయనకు కలెక్టర్ కోయ శ్రీహర్ష స్వాగతం పలికారు. అనంతరం ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి, జిల్లెలపల్లి గ్రామాలలో ఉన్న ఇసుక రీచ్‌లను టీజీఎండీసీ వైస్ చైర్మన్ బీఆర్‌వీ సుశీల్‌కుమార్‌తో కలిసి తనిఖీ చేశారు. మైనింగ్ శాఖ కార్యదర్శి ఎన్.శ్రీధర్ మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా నివారణకు అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. సామాన్య ప్రజలకు తక్కువ ధరకు ఇసుక అందుబాటులోకి రావాలని, నిర్ణీత ధరకు మాత్రమే ఇసుక అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఇసుక రవాణా జరిగే వాహనాల ట్రాకింగ్ సిస్టం ఏర్పాటు చేసి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని అన్నారు. ఇసుక రీచ్ వద్ద 400 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మించాలని, డిస్పాచ్ సెంటర్‌లను పెంచాలని అన్నారు. 360 డిగ్రీల కెమెరాలు, లైట్లు ఏర్పాటు చేయాలని, ఇసుక స్టాక్ యార్డుల వద్ద ఫెన్సింగ్‌తో పాటు ఒకే ఎంట్రీ ఎగ్జిట్లను ఏర్పాటు చేయాలన్నారు. ఇసుక రవాణా పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని, బ్లాక్ మార్కెట్ అరికట్టి పేదలకు ఇసుకను అందుబాటులో ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ జిల్లెలపల్లి ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడి కేంద్రాలను తనిఖీ చేసి పాఠ్యాంశాలను బోధించారు. మంథని ఆర్డీవో సురేష్, అసిస్టెంట్ డైరెక్టర్ మైనింగ్ శ్రీనివాస్, తహసిల్దార్ మధుసూదన్‌రెడ్డి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ గేమ్స్‌కు ఆటో డ్రైవర్ బలి (6)

రూ.50 లక్షల వరకు అప్పు

అప్పులు చెల్లించలేక ఆత్మహత్య

బొగ్గు రవాణాలో **వేగం పెంచాలి**

సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్) సూర్యనారాయణ (8)



సీఎస్‌పీ పరిశీలిస్తున్న డైరెక్టర్ సూర్యనారాయణ

- శౌచాలయాలు లేక ప్రజల అవస్థలు
- ప్రధాన కూడళ్లలో లేక ఇబ్బందులు
- పట్టించుకోని మున్సిపాలిటీ అధికారులు
- ఇబ్బందులు పడుతున్న జనం

ఉగ్గబట్టేదెలా...!



జెండా చౌరస్తాలో నిర్మించాల్సి చోట దుకాణ సముదాయం

పెద్దపల్లి టౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో సరైన మరుగుదొడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పెద్దపల్లి పట్టణంలో రద్దీ ప్రాంతంలో మరుగుదొడ్లు లేకపోవడం, నిర్మించిన వాటి నిర్వహణ లేక మూసివేయడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రం కావడంతో వ్యాపార, వాణిజ్య సంస్థలు నెలకొల్పడంతో పాటు ప్రభుత్వ కార్యాలయాలకు ప్రజలు వస్తూపోతున్నారు. దీనికి అనుగుణంగా మున్సిపల్ శాఖ పలు వసతులు కల్పించాల్సి ఉంటుంది. అందులో ప్రధానంగా మరుగుదొడ్ల నిర్వహణ చేపట్టాల్సి ఉంటుంది.



తుప్పు పట్టిన స్టీల్‌తో నిర్మించిన మరుగుదొడ్డి

2014లో పాలక వర్గం జెండా చౌరస్తా, మజీద్ చౌరస్తా, జూనియర్ కాలేజీ పక్కన, కమాన్ చౌరస్తా, బస్టాండ్ ప్రాంతాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి తీర్మానించింది. కేంద్ర ప్రభుత్వ స్వచ్ఛ భారత్ నిధులతో బస్టాండ్, జూనియర్ కాలేజీ పక్కన, మున్సిపల్ ఆఫీస్ వద్ద మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. కమాన్ వద్ద వ్యాపారుల ఒత్తిడితో నిర్ణయించిన స్థలంలో నిర్మించలేదు. జెండా చౌరస్తాలో అప్పటి వరకు బస్ షెల్టర్‌గా ఉన్న నిర్మాణాన్ని తొలగించి మరుగుదొడ్ల నిర్మాణం చేసేందుకు చర్యలు తీసుకున్నారు. అయితే కజ్జపు ప్రసాద్, శివకుమార్, భగవాన్‌లు ఇంట్లోకి దుర్వాసన వస్తుందని కోర్టుకు వెళ్లారు. కోర్టు మున్సిపాల్టీకి అనుకూలంగా తీర్పునిచ్చింది. దీంతో పనులు ప్రారంభించేలోపే అప్పటి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి మరుగుదొడ్ల నిర్మాణానికి బదులు అదే నిర్మాణాలను దుకాణాలకు కేటాయించారు. కాలేజీ వద్ద స్టీల్‌తో నిర్మించగా కొన్ని రోజుల తర్వాత తుప్పు పట్టడంతో మూసి వేశారు. ఇక మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్మించిన మరుగుదొడ్లు ఎప్పటికీ తాళం వేసే ఉంటాయి. కునారం రోడ్డులో ప్రజలకు అందుబాటులో నిర్మించలేదు. సాగర్ రోడ్డులో టాయిలెట్స్ ఉన్నట్లు ఎవరికి తెలియదు. కేవలం బస్టాండ్ వద్ద నిర్మించిన మరుగుదొడ్డి మాత్రం సేవల్లో ఉంటుంది. పెద్దపల్లిలో ప్రధాన కూడళ్ళయిన జెండా, మజీద్, కమాన్ చౌరస్తాల్లో మరుగుదొడ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితితులపై మున్సిపల్ కార్యాలయానికి ప్రజల నుంచి ఎన్నో వినతులు వెళ్ళాయి. ఈ విషయమై ఠాగూర్ హన్మాన్ సింగ్ అనే న్యాయవాది కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్న కలెక్టర్ మరుగుదొడ్ల నిర్మాణాలు, వాటి నిర్వహణపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

స్థలాలు చూస్తున్నాం

- మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్

మరుగుదొడ్ల నిర్మాణాల కోసం స్థలాలు వెతుకుతున్నాం. చెడిపోయిన వాటికి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకువస్తాం, మూసి ఉన్న మరుగుదొడ్ల నిర్వహణకు చర్యలు తీసుకుంటాం

సెల్‌ఫోన్ దొంగ అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్‌ను దొంగిలించిన ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన యువకుడు బొడ్డు నిఖిల్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై రమాకాంత్ శనివారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని రాగట్లపల్లికి చెందిన నూకల సాయివంశీ ఈ నెల 13న అనారోగ్యంతో బాధపడుతూ మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరాడు. తన రూ.25 వేల విలువైన సెల్‌ఫోన్‌ను పడకపై ఉంచి మూత్రశాలకు వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి సెల్‌ఫోన్ కనిపించలేదు. దాంతో సాయివంశీ పెద్దనాన్న మందాటి రాము పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మండల కేంద్రంలోని కొత్త బస్టాండు ప్రాంతంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో అనుమానాస్పదంగా కనిపించిన యువకుడు నిఖిల్‌ను అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించారు. అతడిని విచారించగా సాయివంశీకి సంబంధించిన సెల్‌ఫోన్‌ను తానే దొంగిలించానని నిఖిల్ అంగీకరించినట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి కేసులో యువకుడి అరెస్ట్

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగమరెడ్డిపల్లి గ్రామ శివారులో గంజాయి అమ్మడానికి వచ్చిన పున్ని వేణు అనే యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల సీఐ మొగిలి, ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ పేర్కొన్నారు. గొల్లపల్లి గ్రామానికి చెందిన వేణు ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ జల్సాలకు అలవాటు పడ్డాడు. గంజాయి అమ్మడం ద్వారా డబ్బులు సంపాదించవచ్చనే ఆలోచనతో శనివారం గంజాయి తీసుకొని ఇల్లంతకుంటకు వస్తుండగా అరెస్ట్ చేసినట్టు తెలిపారు. నిందితుడి వద్ద 600 గ్రాముల గంజాయి, మొబైల్ స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేపాక గ్రామానికి చెందిన రొండ్ల కిరణ్ రెడ్డి(38) రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. గ్రామస్థుల వివరాలు ప్రకారం.. కిరణ్‌రెడ్డి శుక్రవారం అర్ధరాత్రి సిద్దిపేట నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వస్తున్నాడు. వాహనానికి అడ్డుగా అడవిపంది రావడంతో కిందపడి గాయాల పాలయ్యాడు. కిరణ్‌రెడ్డిని కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

పెగడపల్లి, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన కంబాల హారిక(30)హైదరాబాదు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు పెగడపల్లి ఎస్సై సీహెచ్. రవికిరణ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు ఈ నెల 13న హారిక వ్యక్తిగత కారణాలతో ఆమె 10ఏళ్ల కుమారుడు కృష్ణంత్, 8ఏళ్ల కూతురు మయాంతలక్ష్మి ఇంటిలో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగారు. చికిత్స కోసం హైదరాబాదుకు తరలించగా చికిత్స పొందుతూ హారిక మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కుమారుడు, కూతురు పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు

మల్యాల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బాలికను తీసుకెళ్లిన ఓ యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. జగిత్యాల మండలానికి చెందిన ఓ బాలిక(17) తన అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటోంది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఇంట్లో ఉన్న బాలిక శనివారం వేకువజామున చూసే వరకు కనిపించకపోడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతర్గాంకు చెందిన యువకుడిపై అనుమానాలు వ్యక్తం చేయడంతో అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.



కమెడియన్‌గా నటించాలని ఉంది

- విష్ణుగుప్త, జీహెచ్‌ఎస్, రాంనగర్

సీరియల్స్‌లో, సినిమాల్లో నటిస్తా... విలన్, కమెడియన్‌గా నటించాలని ఆసక్తిగా ఉంది. ప్రేమ, బాధ, దుఃఖం, కోపం, ధీరత్వం, అద్భుతం వంటి అనేక అంశాల్లో శిక్షణ ఇచ్చారు.

స్టేజి ఫియర్ పోయింది..

- జి శశాంక్, ఎలగందుల మోడల్ హైస్కూల్

అమ్మ ప్రోత్సాహంతో నటనలో శిక్షణ పొందాను. స్టేజ్ ఫియర్ పోయింది. హీరోగా పాత్రలు ధరించాలని ఉంది. శిక్షణ బాగా అనిపించింది.



'రోల్ ప్లే'లో చిన్నారుల ప్రతిభ

కలెక్టర్ సహకారంతో నటనలో శిక్షణ పొందిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

● చిల్డ్రన్ థియేటర్ ఫెస్ట్‌లో ప్రదర్శన

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కళ అందరిలో దాగి ఉంటుంది. దాన్ని వెలికితీసే సందర్భాలు, ప్రోత్సాహం, శిక్షణ ఉంటే ఆయా కళలు బహిర్గతమవుతాయి. కలెక్టర్ పమేలా సత్పతి సూచనలతో కరీంనగర్‌కు చెందిన మోడ్రన్ యాక్టింగ్ స్కూల్ ఆఫ్ కరీంనగర్ (మాస్క్) చైర్మన్ అనసూరి భూనాథాచారి ఆధ్వర్యంలో 45 మందికి శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రోల్ ప్లే విభాగంలో శిక్షణ పొందారు. ఈ మేరకు శనివారం కళాభారతిలో జరిగిన చిల్డ్రన్ థియేటర్ ఫెస్టివల్‌లో చిన్నారులు నేర్చుకున్న నటనను ప్రదర్శించి అందరినీ అబ్బుర పరిచారు.

● అలరించిన ప్రదర్శనలు

కరీంనగర్ కళాభారతిలో చిల్డ్రన్ థియేటర్ ఫెస్ట్-2025 శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ పమేలా సత్పతి హాజరై చిన్నారుల ప్రదర్శనను తిలకించారు. అద్భుత నటనతో ఆకట్టుకున్న విద్యార్థులందరికీ ప్రశంసా పత్రాలు ప్రదానం చేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ధైర్యాన్ని, సామాజిక స్పృహను పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మాస్క్ చైర్మన్ అనసూరి భూనాథాచారి, సీకేటీ అధ్యక్ష కార్యదర్శులు తిప్పర్తి ప్రభు, మంచాల రమేశ్, తిప్పర్తి రమేశ్, జి కృపాదానం, గోపాల్‌రావు, గాజుల రవీందర్, నాంపెల్లి శ్రీనివాస్, ఎంఏ మతీన్, అయిలు రమేశ్, మాడిశెట్టి గోపాల్, చకిలం స్వప్న, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.



బాలికల రోల్ ప్లే ప్రదర్శన



కళాభారతిలో చిన్నారుల రోల్ ప్లే ప్రదర్శన



కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

మంచి స్పందన వచ్చింది

- అనసూరి భూనాథాచారి, మాస్క్ చైర్మన్



తొలుత కలెక్టర్ మేడం చెప్పాక భయమేసింది. పిల్లలు వస్తారో రారో అనుకున్న. రెండు మూడు రోజుల్లోనే విద్యార్థుల నుంచి మంచి స్పందన వచ్చింది. ప్రోత్సాహం, సహకారం అందించిన కలెక్టర్‌కు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు.



పాఠశాల తరుపున ప్రోత్సాహం అందించారు

- జి దివ్య, జీహెచ్‌ఎస్ సప్తగిరికాలని

అనతికాలంలో శిక్షణనిచ్చిన మాస్క్‌కు కృతజ్ఞతలు. ఇంకా నటన నేర్చుకోవాలనుకుంటున్నాను. పాఠశాల తరపున ప్రోత్సాహం అందించారు. మదర్ క్యారెక్టర్ అంటే ఇష్టం. సీరియల్స్, షార్ట్ ఫిల్మ్స్, సినిమాల్లో నటించాలని ఉంది.

ఏ ప్రాత అయినా చేస్తా..

- ఎస్ కావ్య (10వ) జీహెచ్‌ఎస్ సప్తగిరికాలని



ఇన్నాళ్లు మాలో దాగిన కళ బయటకొచ్చింది. ఏ పాత్ర అయినా చేసేస్తా. ఇదివరకంటే ఇప్పుడు ధైర్యం, యాక్టీవ్‌గా మాట్లాడుతున్నా. ఇంట్లో, స్కూల్లో, నా తోటి మిత్రుల ప్రోత్సాహంతో నటన నేర్చుకున్నా.

ఆన్‌లైన్ గేమ్స్‌కు ఆటో డ్రైవర్ బలి

● రూ.50 లక్షల వరకు అప్పు
● చెల్లించలేక ఆత్మహత్య



చొప్పరి దేవేందర్ (ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా యైటింక్లయిన్ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ చొప్పరి దేవేందర్ (35) ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసగా మారి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. దేవేందర్ ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసగా మారాడు. కొన్నేళ్లుగా ఆడుతూ సుమారు రూ.50 లక్షల వరకు అప్పులు చేశాడు. ఆన్‌లైన్ గేమ్స్‌లో డబ్బులు పోగొట్టుకోవడం, అప్పులు చెల్లించలేక ఆర్థికంగా ఇబ్బందులతో శుక్రవారం రాత్రి ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు కిందకు దించి హుటాహుటిన గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స చేసేందుకు నిరాకరించడంతో దేవేందర్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే దేవేందర్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడు దేవేందర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుమారుడిపై తండ్రి ఫిర్యాదు

మల్యాల, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్‌కు చెందిన గడ్డం రాజచంద్రశేఖర్‌రెడ్డికి కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేక ఇంట్లో వారిని, చుట్టు పక్కల వారిపై దాడులకు పాల్పడుతున్నాడు. దీంతో అతడి తండ్రి మహిపాల్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి రాజచంద్రశేఖర్‌రెడ్డిని న్యాయస్థానంలో హాజరు పరిచినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

● ఎండుతున్న పంటలు ● ఆందోళనలో రైతులు



ఎండుతున్న వరిపంటను చూపుతున్న రైతులు

గంబీరావుపేట ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్తాఫానగర్ గ్రామ సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి పంటలు ఎండుతున్నాయంటూ శనివారం రైతులు ఆందోళన చేపట్టారు. లోవోల్టేజీ కారణంగా నెలలో రెండు సార్లు ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో పంటలకు సాగునీటి ఇబ్బంది తలెత్తిందని వాపోయారు. చిరుపొట్ట దశలో ఉన్న వరి పంటలకు సాగునీరు అందే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను తక్షణమే మరమ్మతులు చేపట్టి పంటలను కాపాడాలని కోరారు. ఈ ఆందోళనలో రైతులు దేవయ్య, రాజయ్య, భూమయ్య, రాములు, శ్రీనివాస్, శేఖర్, కృష్ణకాంత్ తదితరులు ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేయాలి

సిరిసిల్ల టౌన్ : ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి పంటలు ఎండిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గంబీరావుపేట మండలం ముస్తాఫానగర్ గ్రామ రైతులు ఆరోపించారు. శనివారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో రైతులు మాట్లాడారు. ముస్తాఫానగర్‌లో 100 కేవీ కెపాసిటీ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పై 130 కేవీ కెపాసిటీ భారం పడుతోందన్నారు. అనుమతి లేకుండా ఉన్న కనెక్షన్లు తొలగించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. సెస్ అధికారులు స్పందించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో రైతులు ఎండీ అక్బర్ ఖాన్, శివంది దేవయ్య, దోమకొండ భూమయ్య, కంటె దేవయ్య, దోమకొండ దేవయ్య, శివంది శ్రీనివాస్, బోదాస్ లక్ష్మయ్య, శివుని రాములు, శివంది కిషన్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో పలువురికి గాయాలు

తంగళ్లపల్లి, (సిరిసిల్ల రూరల్) ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం టెక్స్‌టైల్ ఇందిరాపార్కులో శనివారం కుక్కలు దాడి చేయడంతో పలువురు గాయపడ్డారు. ఇందిరమ్మ కాలనీ గ్రామంలో రోడ్డుపై ఆడుకుంటున్న ఓగులాపూర్ గ్రామానికి చెందిన చెల్ల శ్రీవర్ధన్(2)పై కుక్కలు దాడి చేశాయి. అడ్డుకునేందుకు వెళ్లిన ఆకుబత్తిని రుక్మంబాయి, అనురాధ, గౌడ సాన్విలతో పాటు మరికొందరిపై దాడి చేయడంతో గాయాలయ్యాయి. కుక్కల దాడిలో గాయపడ్డ వీరిని గ్రామస్థులు సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ

● ఒకరికి తీవ్రగాయాలు

మానకొండూర్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మానకొండూర్‌లో పోలీసుస్టేషన్ సమీపంలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ద్విచక్రవాహనంపై వెళ్తున్న మానకొండూర్ మండలం శ్రీనివాస్‌నగర్ గ్రామ కారోబార్ బొల్లం శ్రీనివాస్‌ను, హుజూరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. శ్రీనివాస్‌కు తీవ్రగాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు.

కరెంట్ మోటార్ల దొంగల అరెస్టు

● వివరాలు వెల్లడించిన ఎస్పీ అశోక్ కుమార్



పోలీసులు స్వాధీనం చేసుకున్న కరెంటు మోటార్లు

మెట్‌పల్లి టౌన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను శనివారం పోలీస్‌లు పట్టుకున్నారు. శనివారం పట్టణంలోని సర్కిల్ కార్యాయలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ అశోక్‌కుమార్ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంత కాలంగా కోరుట్ల, మెట్‌పల్లి సర్కిల్ పోలీస్ పరిధిలో తాళం వేసిన ఇళ్లలో, వ్యవసాయ మోటార్లు అధిక సంఖ్యలో దొంగతనాలు జరుగుతున్నాయని నిందితులను పట్టుకునేందుకు మెట్‌పల్లి డీఎస్పీ రాములు, సీఐ నిరంజన్‌రెడ్డి నేతృత్వంలో ఓ ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిందితులను పట్టుకునేందుకు సీసీ పుటేజీలు, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించినట్లు తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలంలోని మేడిపల్లి క్రాస్ రోడ్డు వద్ద శనివారం ఎస్సై అనిల్ వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారిని విచారించగా దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించినట్లు పేర్కొన్నారు. మెట్‌పల్లి పట్టణానికి చెందిన కుంచెపు వెంకటేష్, నిజామాబాద్ జిల్లా ఎడపల్లిలోని ఎఆర్‌పి క్యాంపునకు చెందిన సూర్యవంశీ సాయికుమార్ ప్రస్తుతం రాఘవపేట గ్రామంలో ట్రాక్టర్ డ్రైవర్, మెట్‌పల్లికి చెందిన స్క్రాప్ వ్యాపారి అబ్దుల్ బారి ముగ్గురు కలిసి ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి, మల్లాపూర్, కథలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలలో దొంగతనాలు చేసినట్లు వెల్లడించారు. వీరి వద్ద నుంచి 6 లక్షల విలువ గల 1 మోటార్ సైకిల్, 30 కిలోల రాగి వైరు, 30 వ్యవసాయ కరెంట్ మోటార్లు 5 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. తక్కువ సమయంలో కేసు ఛేదించిన మెట్‌పల్లి డీఎస్పీ రాములు, సీఐ నిరంజన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి, మల్లాపూర్ ఎస్‌ఐలు అనిల్, కిరణ్, రాజు, సిబ్బంది చైతన్య, కిరణ్, అనిల్, సాధునాయక్, మారుతిలను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పంటలు

కూరగాయల సేద్యంతో అదనపు ఆదాయం పొందుతున్న రైతు గోపాల్



సాగు చేసిన కూరగాయాల తోట

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): అతడో సాధారణ రైతు.. సంప్రదాయ పద్ధతిలో ఏటా వరి సాగుతో నష్టాలను చవిచూశాడు. దీంతో ఎలాగైన కష్టాల నుంచి గట్టెక్కాలని భావించాడు. ఉన్న కొద్దిపాటి భూమిలో కూరగాయలు పండించాలని నిర్ణయించుకున్నాడు. తనకున్న ఆరు గుంటల్లో 12 రకాల పంటలను వేశాడు. పెట్టుబడి పోను గత ఆరునెలల్లో రూ.30 వేల వరకు ఆదాయం సమకూరిందని హర్షం వ్యక్త చేస్తున్నాడు ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన రైతు అంతెర్పుల గోపాల్.

● వేర్వేరు పంటల సాగు.

మండల కేంద్రానికి చెందిన రైతు అంతెర్పుల గోపాల్ గ్రామ శివారులో తనకున్న 11 గుంటల్లో వరి పంటను సాగు చేసినా దిగుబడి అంతంత మాత్రమే రావడంతో ఆలోచనలో పడ్డాడు. కుటుంబ పోషణ భారంగా మారినా వ్యవసాయంపై ఉన్న మక్కువతో సాగుపై ప్రత్యేక దృష్టి పెట్టాడు. మరో ఎకరం భూమిని కౌలుకు తీసుకుని వరి పంటను సాగు చేసినా ఫలితం లేకుండాపోయింది. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం వచ్చే కూరగాయల పంటల సాగును ఐదేళ్ల క్రితం ప్రారంభించాడు. 1.11 ఎకరాల భూమిలో 1.05 ఎకరాల్లో వరి పంటను, మిగిలిన 6 గుంటల్లో 12 రకాల కూరగాయల పంటలను సాగు చేశాడు. గుంట విస్తీర్ణంలో మిరప, మరో గుంటలో బెండ, మిగతా భూమిలో అర గుంట చొప్పున నాలుగు గుంటల్లో టమాట, బీర, కాకర, వంకాయ, గోరుచిక్కుడు, అల్చింత, పాలకూర, మెంతి, కొత్తిమీరతో పాటు ఒడ్డుకు రెండు వైపులా సోరకాయ పంటలను పండిస్తున్నాడు. 12 రకాల పంటలకు గాను దున్నడం, విత్తనాల ఖర్చులకు రూ.10 వేల వరకు వెచ్చించాడు. రెండు రోజులకొకసారి తడులు పెడుతున్నాడు. పండిన కూరగాయలను తెంపి మండల కేంద్రంతో పాటు రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి గ్రామాల్లో జరిగే బుధ, శుక్ర, శనివారాల్లోని వార సంతల్లో విక్రయిస్తున్నాడు. పంట పెట్టుబడి పోను ఆరు నెలల్లో రూ.30 వేల ఆదాయం సమకూరిందని రైతు గోపాల్ పేర్కొంటున్నాడు. ఒకే రకమైన పంటల సాగుతో కాకుండా వేర్వేరు రకాల పంటలను పండించడంతో నష్టాల నుంచి గట్టెక్కవచ్చనని గోపాల్ చెబుతున్నాడు.



కోతుల బెడదకు తోట చుట్టూ ఏర్పాటు చేసిన వల

అదనపు ఆదాయం పొందుతున్నా..

- అంతెర్పుల గోపాల్, రైతు

నాకున్న 11 గుంటల్లో మొదట వరి వేసేవాడిని. లాభం లేకుండాపోయింది. దాంతో పక్కనే ఉన్న ఎకరం భూమిని కౌలుకు తీసుకున్నాను. మొత్తం 1.11 ఎకరాల్లో 1.05 ఎకరాల విస్తీర్ణంలో వరి పంటను వేశాను. 6 గుంటల్లో సేంద్రియ పద్ధతిలో కూరగాయలను పండిస్తున్నాను. కోతుల బెడద నుంచి పంటలను కాపాడుకునేందుకు తోట చుట్టూ వలను ఏర్పాటు చేశాను. వరి సాగుతో పాటు కూరగాయలను పండించడం వల్ల నెలకు రూ. 5వేల వరకు అదనపు ఆదాయం సమకూరుతోంది.

ఆర్టీవో అధికారులు వేధిస్తున్నారని నిరసన

● లారీ పైకి ఎక్కి విద్యుత్ తీగలు పట్టుకుంటానని బెదిరింపు



లారీ ఎక్కి నిరసన తెలుపుతున్న అనీల్‌గౌడ్

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) ఆర్టీవో అధికారులు మాముళ్ళు వసూలు చేస్తున్నారని శనివారం బసంత్‌నగర్‌కు చెందిన ముత్యం అనీల్‌గౌడ్ అనే లారీ ఓనర్ నిరసన తెలిపాడు. లారీ పైకి ఎక్కి కరెంటు తీగలు పట్టుకొని ఆత్మహత్యాయత్నం చేసుకుంటానని ఆందోళన చేపట్టాడు. ఈ సందర్భంగా అనీల్ మాట్లాడుతూ తనపై కక్ష గట్టి ఆర్టీవో అధికారులు లారీలపై కేసులు రాసి ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. లారీ గతంలో ఓవర్‌లోడ్‌తో వెళ్తున్నప్పుడు అధికారులు ఆపి కేసు రాశారని, దానికి సంబంధించి జరిమానా శుక్రవారం చెల్లించానని, అదే రోజు మరో లారీకి ధ్రువపత్రాలు లేవని, మళ్లీ కేసు రాశారని వివరించారు. స్థానికులు, పోలీసులు నచ్చ జెప్పడంతో పైనుంచి కిందికి దిగాడు. అయితే జిల్లా రవాణాశాఖ అధికారి రంగారావును వివరణ కోరగా ఏడున్నర నెలల క్రితం ఓవర్ లోడ్ కేసు నమోదైందని, దానికి సంబంధించి జరిమానా చెల్లించాడని, మరో లారీ పత్రాలు సక్రమంగా లేకపోవడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రవాణా అధికారులు మాముళ్ళకు పాల్పడితే కేసు నమోదు చేయరని, ఆయన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు.

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న గ్రామస్థులు

కోనరావుపేట ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనగర్తి గ్రామ శివారులోని మూలవాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను గ్రామస్థులు శనివారం అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారులు ఇచ్చిన పర్మిషన్‌తో నడుస్తున్నప్పటికీ గ్రామస్థులు అడ్డుకున్నారు. ఇసుకను ట్రాక్టర్లతో తరలించడం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయి నీటి ఎద్దడి నెలకొంటుందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తూ ఇసుకను తరలించకుండా అడ్డుకున్నారు. వేరే ప్రాంతం నుంచి ఇసుకకు పర్మిషన్ ఇవ్వాలని కోరారు.



కనగర్తిలో ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న గ్రామస్థులు

గీత కార్మికుడికి గాయాలు

శంకరపట్నం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి జారిపడడంతో ఓ గీత కార్మికుడికి తీవ్రగాయాలైన సంఘటన కరీంపేట గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంపేట గ్రామానికి చెందిన గీతకార్మికుడు గుర్రం వీరస్వామి శనివారం సాయంత్రం వృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు గుజి ఊడిపోవడంతో పట్టు కోల్పోయి చెట్టుపై నుంచి జారుతూ మధ్యలో వచ్చి ఆగాడు. గమనించిన గీత కార్మికులు వీరస్వామిని కిందకు దింపారు. ఈ ప్రమాదంలో వీరస్వామి దంతాలు విరగడంతో పాటు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం అతడిని కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

కొండగట్టులో భక్తుల రద్దీ


అంజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో ఉన్న భక్తులు

మల్యాల, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిదానం శనివారం భక్తులతో రద్దీగా మారింది. వేలాదిగా వచ్చిన భక్తులు అంజన్నను దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో కృష్ణప్రసాద్, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ ఇతర అధికారులు పర్యవేక్షించారు.

ప్రపంచ దేశాలతో పోటీ పడుతున్న భారత్


మాట్లాడుతున్న అప్పాల ప్రసాద్‌జి

భగత్‌నగర్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): భారతదేశం ప్రపంచ దేశాలతో పోటీ పడుతున్నదని సామాజిక, సమరత వేదిక తెలంగాణ ప్రాంత సంయోజక్ అప్పాల ప్రసాద్‌జీ అన్నారు. శనివారం నగరంలోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహిస్తున్న స్వదేశీ మేళాలో ఆయన మాట్లాడుతూ స్వదేశీ పరిజ్ఞానం, ఆలోచనలతో వికసిత్ భారత్ వైపు అడుగులు వేస్తున్నదన్నారు. దేశం ఆర్థికంగా పురోగతి సాధించాలంటే స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయాలన్నారు. జపాన్ దేశం అణుబాంబును ఎదుర్కొని అణతి కాలంలోనే ఆర్థికంగా ఎదిగి అమెరికాతో పోటీ పడే స్థాయికి ఎదిగిందన్నారు. భారతదేశం 75 సంవత్సరాల తర్వాత ఆర్థికంగా అభివృద్ధి సాధించి 102 దేశాలకు అన్నపెడుతుందన్నారు. 168 ఆర్థిక ర్యాంకింగ్‌లో ఉన్న దేశం నేడు 5వ స్థానంతో దూసుకు పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్వదేశీ జాగరణ్ మంచ్ కన్వీనర్ ముక్క హరీష్‌బాబు, కో-కన్వీనర్ కళ్లెం వాసుదేవరెడ్డి, వసంత్ వ్యాలీ కరస్పాండెంట్ ఇనుకొండ బుచ్చిరెడ్డి, సప్తగిరి హైస్కూల్ చైర్మన్ నగేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులు స్టార్టప్ కంపెనీల సేవలను సద్వినియోగం చేసుకోవాలి


కార్యక్రమంలో పాల్గొన్న కంపెనీ ప్రతినిధులు, శాస్త్రవేత్తలు, రైతులు

జగిత్యాల అగ్రికల్చర్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): రైతులందరూ స్టార్టప్ కంపెనీల ఉత్పత్తులను, సేవలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ భారతీ నారాయణ్ భట్ అన్నారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పొలాస, జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ వారి ఆధ్వర్యంలో అగ్‌మార్క్ అగ్రిటెక్ మార్కెట్ ఆక్సెస్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. సహ పరిశోధన స్థానం సంచాలకుల ఇంచార్జి శ్రీనివాస్ మాట్లాడుతూ రూరల్ ఇన్నోవేషన్ స్టాక్స్ అందించే సేవలను అందిపుచ్చుకొని రైతులు ఆర్థికంగా ఎదగాలని సూచించారు. శాస్త్రవేత్త రజినీదేవి మాట్లాడుతూ రూరల్ ఇన్నోవేషన్ స్టాక్స్, రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులు స్టార్టప్ సేవలను ఉపయోగించుకునేందుకు, గ్రామ ఆవిష్కరణలకు స్టాక్ అందించే విషయాన్ని వివరించారు. అనంతరం వివిధ కంపెనీలు తమ ఉత్పత్తులను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు వివరించారు. తదనంతరం స్టార్టప్ కంపెనీల ఉత్పత్తులైన రోబోట్స్, డ్రోన్స్‌ని క్షేత్రప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల, కరీంనగర్, సిరిసిల్ల, కామారెడ్డి జిల్లాల్లోని 11 మంది రైతు ఉత్పత్తిదారుల సంఘాల బాధ్యులు, సీఈవోలు, రైతులు, స్వశక్తి సంఘాల మహిళలతో పాటు అగ్రిహబ్ సీఈవో విజయ్, నాబార్డు కరీంనగర్ ఏజీయం జయప్రకాశ్, ఇన్నోవేషన్ స్టాక్ రూరల్ స్టాక్ కోఆర్డినేటర్ రంజిత్ కుమార్, అగ్రిహబ్ మేనేజర్ ముఖేష్ పాల్గొన్నారు.

కల సాకారం

గోదావరి నదిపై పూర్తయిన సదర్‌మాట్ బ్యారేజీ నిర్మాణం


సదర్‌మాట్ బ్యారేజీ

- 18 వేల ఎకరాలకు సాగునీరు
- త్వరలో సీఎం చేతుల మీదుగా ప్రారంభానికి ఏర్పాట్లు

జగిత్యాల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల-నిర్మల్ జిల్లాల సరిహద్దులో గల గోదావరి నదిపై సదర్‌మాట్ బ్యారేజీ నిర్మాణం పూర్తి కావడంతో అన్నదాతల కల నెరవేరి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మూలరాంపూర్ గ్రామ శివారులో గోదావరి నదిపై సదర్‌మాట్ బ్యారేజీ నిర్మాణం 2017 జనవరిలో ప్రారంభించగా ఎట్టకేలకు 2024లో పనులు పూర్తి అయ్యాయి. దీంతో జగిత్యాల, నిర్మల్ జిల్లాల్లో 18 వేల ఎకరాల పంట భూములు సస్యశ్యామలం కానున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.554.28 కోట్ల నిధులు వెచ్చించి బ్యారేజీ నిర్మాణం చేపట్టారు. పనులు గతేడాది పూర్తి కావాల్సి ఉన్నా వరదలు రావడంతో పాటు, ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో పనులు ఆలస్యం అవుతూ వచ్చాయి. బ్యారేజీ నిర్మాణంతో జగిత్యాల, నిర్మల్ జిల్లాలలోని 500 మందికుపైగా రైతులకు చెందిన సుమారు 1230 ఎకరాలు ముంపునకు గురయ్యాయి. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కోమటికొండాపూర్, ఎర్దండి, మూలరాంపూర్, నిర్మల్ జిల్లా మామడ మండలం కమల్‌కోట, పోన్కల్, టెంబుర్ని, ఆదర్శనగర్ గ్రామాలకు చెందిన రైతుల వ్యవసాయ భూములు ముంపునకు గురికాగా బాధిత రైతులకు గత ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించింది.


బ్యారేజీపై నుంచి రహదారి

తీరనున్న సాగునీటి కష్టాలు

సదర్మాట్ బ్యారేజీ నిర్మాణంతో జగిత్యాల, నిర్మల్ జిల్లాలో 18 వేల ఎకరాల పంట పొలాలు సస్యశ్యామలం కానున్నాయి. జగిత్యాల జిల్లాలో 4,896 ఎకరాలకు, నిర్మల్ జిల్లాలో 13,120 ఎకరాల ఆయకట్టుకు రెండు పంటలకు సాగు నీరు అందనుంది. సదర్మాట్ బ్యారేజీ కింద గతంలో వేములకుర్తి శివారులో నిర్మించిన గంగానాల ప్రాజెక్ట్‌ను నింపి అక్కడి నుంచి వివిధ గ్రామాలకు సాగునీరు అందించనున్నారు. గతంలో వేసవిలో పంటలు ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడేవారు. బ్యారేజీ నిర్మాణంతో జిల్లాలోని వేములకుర్తి, యామపూర్, ఫకీర్ కొండపూర్‌తో పాటు మల్లాపూర్ మండలం నడికుడ, మొగిలిపేట, ఒబులపూర్ గ్రామాల రైతులకు రెండు పంటలకు సాగు నీరు అందనుంది. ప్రస్తుతం సదర్‌మాట్ గేట్లు ఓపెన్ చేయడంతో చివరి ఆయకట్టు వరకు రైతులు సాగు చేయడంతో ఆ ప్రాంతం పచ్చని పంటలతో కళకళలాడుతుంది. సదర్మాట్ బ్యారేజీ పొడవు కిలోమీటర్ ఉండగా బ్యారేజీపై సుమారు 7.5 మీటర్ల వెడల్పుతో వాహనాలు వెళ్లే విధంగా రోడ్డు నిర్మాణం చేపట్టారు. బ్యారేజీకి 55 గేట్లు బిగించారు. నిర్మాణం పూర్తి కావడంతో బ్యారేజీకి జలకళ సంతరించుకుంది.

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే మరింత ప్రయోజనం

జగిత్యాల-నిర్మల్ జిల్లాల సరిహద్దులో గల గోదావరి నదిపై సదర్మాట్ బ్యారేజీ నిర్మాణం పనులు పూర్తి కావడంతో ఈనెల చివరి నాటికి ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బ్యారేజీ ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించాలని అధికారులు, ప్రజాప్రతినిధులు యోచిస్తున్నారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మార్చి మొదటి లేదా రెండో వారంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం అవుతుందన్న అభిప్రాయాలను సంబంధిత వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. గోదావరి నదిపై నిర్మించిన సదర్‌మాట్ బ్యారేజీని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే మరింత ప్రయోజనం కలగనుంది. ప్రాజెక్ట్ నిర్మాణంతో ఇప్పటికే అక్కడ పర్యాటక శోభ సంతరించుకుంది. నిత్యం రెండు జిల్లాలకు చెందిన పర్యాటకులు ప్రాజెక్టును సందర్శిస్తున్నారు. ప్రభుత్వం చొరవ చూపి అక్కడ పార్క్, హోటల్స్, బోటింగ్‌తో పాటు వివిధ సౌకర్యాలు కల్పించి పర్యటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ఇరు జిల్లాల ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్సీగా కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించండి

- ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి, ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి

తిమ్మాపూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఊట్కూరి నరేందర్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పార్టీ శ్రేణులు, పట్టభద్రులకు పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డి తరఫున ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం అల్గునూర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో పట్టభద్రుల దశదిశ పేరిట నిర్వహించిన మానకొండూర్ నియోజకవర్గస్థాయి పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఎన్నో మంచి పనులు చేసిందని, రెండు లక్షల రుణమాఫీ 90శాతం మందికి వర్తింపజేసిందని అన్నారు. వివిధ సాంకేతిక కారణాలతో 2 లక్షల రుణమాఫీ పొందని 10శాతం మందితో ప్రతిపక్షాలు ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయిస్తున్నారని ఎమ్మెల్యే దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధికారంలో లేనపుడే పట్టభద్రులు గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డిని గెలిపించారని గుర్తు చేశారు. ఇప్పుడు పార్టీ అధికారంలో ఉన్నందున కాంగ్రెస్ అభ్యర్థిని తప్పకుండా గెలిపించుకోవాలని అన్నారు. ఓ అభ్యర్థి దేవుళ్ల పేరుతో ఓట్లు అడుగుతున్నాడని, పట్టభద్రులు, మేధావులు ఆలోచించాలని కోరారు. ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి అద్భుతమైన పాలన కొనసాగిస్తున్నారని అన్నారు. తనను గెలిపిస్తే విద్యారంగ అభివృద్ధికి, పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పాటుపడతానని అన్నారు. ఈ సమావేశంలో పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదగోని లక్ష్మీనారాయణగౌడ్ ఉన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక


సిరిసిల్లలో హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలోని ఇంగ్లీష్ యూనియన్ హైస్కూల్‌లో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికై శనివారం బయల్దేరి వెళ్లినట్లు పాఠశాల కరస్పాండెంట్ రాజ్‌కుమార్ తెలిపారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఈ నెల 17 నుంచి 21 వరకు జరిగే ఆల్ ఇండియా ఇంటర్ డిస్ట్రిక్ట్ హ్యాండ్‌బాల్ నేషనల్ చాంపియన్‌షిప్ సబ్ జూనియర్ పోటీలకు ఇంగ్లీష్ యూనియన్ పాఠశాలకు చెందిన వర్షిత్, ప్రహర్షిత్, గుణభద్రలు ఎంపిక కాగా, వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ రాజశేఖర్, కోచ్ ప్రేమ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పండి

- రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్

భగత్‌నగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధిచెప్పాలని రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ పిలుపునిచ్చారు. శనివారం కరీంనగర్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొంరయ్యలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కేసీఆర్‌కు పట్టిన గతే రేవంత్‌రెడ్డికి పడుతుందన్నారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయి రేవంత్‌రెడ్డి ఫ్రస్టేషన్‌లో ఉన్నాడన్నారు. కులగణన ఓ బోగస్ ప్రక్రియ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రధాని మోదీ సామాజికవర్గం గురించి మాట్లాడే స్థాయి లేదన్నారు. కాంగ్రెస్ సర్కార్‌పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. రాష్ట్రప్రభుత్వం చేపట్టిన కులగణన ఓ బోగస్ ప్రక్రియ అని హిందూ, ముస్లిం, బీసీ ముస్లీం అని ఎక్కడైనా ఉందా అని ప్రశ్నించారు. సర్వే లెక్కలు బోగస్ అనితేలడంతో మళ్లీ సర్వేకు అవకాశం ఇచ్చారన్నారు. తెలంగాణ ప్రజలకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చాలన్నారు. సమావేశంలో బీజేపీ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, మాజీ మేయర్లు డి శంకర్, వై సునీల్‌రావు, జిల్లా ప్రధానకార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, మాడ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

వేములవాడకు అదనపు బస్సులు

- మహాశివరాత్రికి ఏర్పాట్లు
- ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బి. రాజు



భగత్‌నగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణరాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని వేములవాడకు 778 అదనపు బస్సులు నడిపిస్తున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి పుణ్యక్షేత్రానికి కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్, నిజామాబాద్ రీజియన్‌లలోని వివిధ డిపోల నుంచి అదనపు బస్సులు నడిపించేందుకు ఆర్టీసీ ప్రణాళికలు రూపొందించిందన్నారు. ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు అదనపు బస్సులు నడిపిస్తున్నామన్నారు తిప్పాపూర్ బస్‌స్టేషన్‌కు 443 బస్సులు, కట్టకింద బస్‌స్టేషన్‌కు 335 బస్సులు నడిపించేందుకు రూట్‌మ్యాప్ సిద్ధం చేశామన్నారు. వేములవాడతో పాటు, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని శైవక్షేత్రాలతో పాటు, భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం శైవక్షేత్రానికి అదనపు బస్సులు నడిపిస్తున్నామన్నారు.

- **కాళేశ్వరం** క్షేత్రానికి మంథని డిపో నుంచి మంథని-కాళేశ్వరానికి 26 బస్సులు నడిపిస్తున్నామన్నారు. భక్తుల రద్దీని బట్టి గోదావరిఖని, కరీంనగర్ నుండి అదనపు బస్సులు నడిపిస్తామన్నారు. వేలాల క్షేత్రానికి గోదావరిఖని డిపో నుండి గోదావరిఖని-వేలాలకు 56 బస్సులు, మంథని డిపో నుంచి మంథని-వేలాలకు 40 బస్సులు నడిపిస్తున్నామన్నారు. అదే విధంగా దుబ్బరాజన్న క్షేత్రానికి జగిత్యాల డిపో నుంచి జగిత్యాల-దుబ్బ రాజన్న రూట్‌లో 50 బస్సులు అదనంగా నడిపిస్తున్నామన్నారు. పొట్లపల్లి క్షేత్రానికి హుస్నాబాద్ డిపో నుంచి హుస్నాబాద్- పొట్లపల్లికి 23 అదనపు బస్సులు నడిపించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.

వేములవాడ బస్‌స్టేషన్ నుంచి ఉచిత బస్సు

మహాశివరాత్రి పురస్కరించుకుని ఈ నెల 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకు భక్తుల సౌకర్యార్థం శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం వేములవాడ ఆధ్వర్యంలో 14 మినీ బస్సులు వేములవాడ బస్‌స్టేషన్(తిప్పాపూర్) నుంచి వేములవాడ దేవాలయం వరకు ఉచిత ప్రయాణ సేవలు అందిస్తాయన్నారు. భక్తులు వేములవాడ బస్‌స్టేషన్ నుంచి దేవాలయం వరకు తిరుగు ప్రయాణంలో దేవాలయం నుంచి బస్‌స్టేషన్ వరకు ఉచిత బస్సు ప్రయాణ సేవలను ఉపయోగించుకోవచ్చన్నారు. భక్తులు వేములవాడ క్షేత్రానికి తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో నడిపిస్తున్న బస్సు సర్వీసు సేవలను సద్వినియోగం చేసుకొని వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామిని దర్శించుకోవాలన్నారు.

వేములవాడ (తిప్పాపూర్ బస్‌స్టేషన్‌కు)

డిపో	రూటు	బస్సులు
కరీంనగర్-1	కరీంనగర్-వేములవాడ	51
కరీంనగర్-2	కరీంనగర్-వేములవాడ	30
కోరుట్ల	కోరుట్ల-వేములవాడ	62
మెట్‌పల్లి	మెట్‌పల్లి-వేములవాడ	105
వేములవాడ	వేములవాడ-జెబిఎస్	84
వేములవాడ	వేములవాడ-కొండగట్టు జగిత్యాల	21
సిరిసిల్ల	వేములవాడ-వరంగల్	27
సిరిసిల్ల	సిరిసిల్ల-వేములవాడ	25
కరీంనగర్-1	వరంగల్-వేములవాడ	16
కరీంనగర్-2	వరంగల్-వేములవాడ	7
హుజూరాబాద్	వరంగల్-వేములవాడ	15

వేములవాడ (కట్టకింద బస్‌స్టేషన్‌కు)

డిపో	రూటు	బస్సులు
నిర్మల్	నిర్మల్-వేములవాడ	83
ఆర్మూర్	ఆర్మూర్-వేములవాడ	100
నిజామాబాద్-1	నిజామాబాద్-వేములవాడ	17
కామారెడ్డి	కామారెడ్డి-వేములవాడ	33
నర్సంపేట్-	నర్సంపేట-మహబూబాబాద్ వేములవాడ	30
వరంగల్-1	వరంగల్-వేములవాడ	21
హన్మకొండ	వరంగల్-వేములవాడ	27
పరకాల	పరకాల-వేములవాడ	24

కేజ్ కల్చర్ ఏర్పాటుతో ముదిరాజ్‌లకు నష్టం


చీర్లవంచ శివారులోని మిడ్‌మానేరు వద్ద ముదిరాజ్ సంఘ నాయకులు

తంగళ్లపల్లి (సిరిసిల్ల రూరల్), ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల మిడ్‌మానేరు డ్యాంలో కేజ్ కల్చర్‌ను ఏర్పాటు చేస్తే ముదిరాజ్ కులస్థులకు తీరని అన్యాయం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం దీనిపై ఆధారపడిన ముదిరాజ్ కులస్థులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు చొక్కాల రాము, మత్స్యశాఖ జిల్లా అధ్యక్షుడు చొప్పరి రామచంద్రం డిమాండ్ చేశారు. తంగళ్లపల్లి మండలం చీర్లవంచ శివారులోని మిడ్‌మానేరు డ్యాంలో అక్వాహబ్ పేరుతో కేజీ కల్చర్‌ను ఏర్పాటు చేస్తున్న ప్రాంతాన్ని శనివారం జిల్లా మత్స్యశాఖ అధికారి సౌజన్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేజ్ కల్చర్‌ను ఏర్పాటు చేయడం వల్ల స్థానికంగా ఉన్న ముదిరాజ్ కులస్థులు, మిడ్‌మానేరు ప్రాజెక్టులో ముంపునకు గురైన నిర్వాసితులకు ఉపాధి కరువవుతుందని అన్నారు. అక్వా పేరిట తమ భూములను తీసుకుని మధ్యమానేరు డ్యాంలో కేజ్‌కల్చర్ ఏర్పాటు చేస్తున్నారని దీనిని ముదిరాజ్ కులస్థులు వ్యతిరేకిస్తున్నారని అన్నారు. వారికి ఉన్న అనుమతులు ఏమిటో చూపించి పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. స్థానికంగా ఉన్న ముదిరాజ్ కులస్థులకు ఉపాధికి ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుం డా కేజ్ కల్చర్ కంపెనీలో పనులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంజన్న ఆలయానికి పులిహోర ప్యాకింగ్ మిషన్ వితరణ

- గంటకు 2,100 ప్యాక్ చేసే సామర్థ్యం


పులిహోర ప్యాకింగ్ మిషన్

మల్యాల, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానం ప్రసాదాల పోటులో పులిహోర ప్యాకింగ్ మిషన్ ఏర్పాటు చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం వరదవెళ్లికి చెందిన పీచర శ్రీహర్షరాజ్యలక్ష్మి అనే అంజన్న భక్తులు రూ.1.55లక్షలతో పులిహోర ప్యాకింగ్ మిషన్ కొనుగోలు చేసి దేవస్థానంకు కానుకగా అందించారు. శనివారం ఈవో కృష్ణప్రసాద్, పర్యవేక్షకులు చంద్రశేఖర్, సునీల్, హరిహర నాథ్, ప్రసాదాల ఇన్‌చార్జీ శ్రీనివాస్ మిషన్‌ను ప్రారంభించారు. పులిహోర ప్యాకింగ్ మిషన్ దేవస్థానం నిర్దేశిత 200గ్రాముల పులిహోరను గంటకు 2,100 ప్యాకెట్లు చేయనుందని అధికారులు తెలిపారు. దీంతో సిబ్బందికి పనిభారం తప్పడంతో పాటు రద్దీ రోజుల్లో మరింత సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు.

ధర్మపురి క్షేత్రంలో పెరిగిన భక్తుల రద్దీ



ధర్మపురి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. దీంతో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సుదూర ప్రాంతాల నుండి క్షేత్రానికి భారీగా భక్తులు తరలి వచ్చారు. పవిత్ర గోదావరి నదిలో భక్తులు స్నానాలు ఆచరించారు. గోదావరి పౌరోహితులచే సంకల్పాది పూజలు చేయించుకున్నారు. అనంతరం ఆలయాలకు చేరుకుని భక్తులు స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో నిలబడ్డారు. భక్తులు వివిధ రకాల పూజల కోసం టిక్కెట్లు కొనుగోలు చేశారు. నరసింహుని ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కళ్యాణం జరిపించి పూజలు చేశారు. శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల రావి చెట్టు ఆంజనేయ స్వామి చుట్టు భక్తులు ప్రదక్షిణాలు చేశారు.. యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. అందంగా పూలతో అలంకరించిన స్వామివారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, వంశీకృష్ణ, విజయ్, నరసింహమూర్తి, నవీన్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాలు భక్తిగీతాలతో ప్రతిధ్వనించాయి. రాత్రి వరకు భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. భక్తులకు ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది సేవలు అందించారు.

నేటి నుంచి కుటుంబ సర్వే దరఖాస్తుల స్వీకరణ

సుల్తానాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సామాజిక కుటుంబ సర్వేకు సంబంధించిన వారు ఆదివారం నుంచి 28వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సర్వేలో వివరాలు చెప్పని వారు, అందుబాటులో లేని వారు దరఖాస్తులు సేవా కేంద్రంలో సమర్పించాలని సూచించారు. దరఖాస్తు ఫారాలు కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

ముత్తారం, (ఆంధ్రజ్యోతి): మండలంలో సమగ్ర కుటుంబ సర్వే కు సంబంధించి ఎవరైనా మిగిలిపోతే మండల ఆఫీసులో దరఖాస్తు చేయాలని ఎంపీడీవో సురేష్ తెలిపారు.

అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

ఘైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్ కాలనీ పరిధిలోని 18వ డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం జిల్లా అదనపు కలెక్టర్ అరుణశ్రీ ఆకస్మిక తనిఖీ చేశారు. మార్కెట్, అల్లూరు శ్మశానవాటిక, హనుమాన్ అలయ సమీపంలోని రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆమె సూచించారు. అత్యవసర పనులకు ప్రాధాన్యం ఇస్తూ పనులను త్వరగా ప్రారంభించాలని సూచించారు.

గ్రామీణ బ్యాంక్ మేనేజర్‌కు వీడ్కోలు

రామగిరి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల గ్రామీణబ్యాంక్ మేనేజర్‌గా రెండు సంవత్సరాలు సేవలు అందించి పంజాబ్‌కు బదిలీపై వెళ్తున్న కార్తీక్ చౌదరిని మాజీ జెడ్‌పీటీసీ గంటవెంకటరమణరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు సన్మానించారు. మాజీ ఉపసర్పంచ్ వెముకనకయ్య, బీఎం క్రాంతి, క్యాషియర్ శ్రీనివాస్, క్రాంతి, శేష తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులపై కక్ష సాధింపు చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న కార్మిక నాయకుడు మురళీధర్‌రావు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులపై అధికారులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మున్సిపల్ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల జాయింట్ యాక్షన్ కమిటీ గౌరవ అధ్యక్షుడు మురళీధర్‌రావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు ఆరోపించారు. శనివారం మార్కండేయకాలనీలో జరిగిన ఒక ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన పారిశుధ్య కార్మికుల సమావేశానికి వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పనిముట్లు ఇవ్వకుండా పని చేయాలని కార్మికులపై ఒత్తిడి తెస్తున్నారన్నారు. సామగ్రి ఇవ్వకుండా పని చేయించుకుంటున్నారని, రక్షణ పరికరాలు ఇవ్వాలని అడిగితే ఇష్టం ఉంటే పనికి రండి, లేకుంటే రాకండి అంటూ బెదిరింపులకు గురి చేస్తున్నారన్నారు. జిల్లా అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ కార్మికులను వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. కమిషనర్ తన విధానాన్ని మార్చుకోవాలని, లేకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్మికులకు పండుగలు, జాతీయ సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో ట్రాలీ డ్రైవర్లు విధులకు హాజరుకాకపోతే నోటీసులు జారీ చేస్తున్నారని, వాటిని ఉపసంహరించుకోవాలన్నారు. మంథని, పెద్దపల్లి, సుల్తానాబాద్ మున్సిపాలిటీల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఐదు నెలల నుంచి వెయ్యి రూపాయలు పెంచి ఇస్తున్నా రామగుండం కార్పొరేషన్‌లో ఇవ్వడం లేదని, పర్మినెంట్ కార్మికులందరికి 9డీఏలు, సరెండర్ లీవులు, దసరా అడ్వాన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో పని చేసిన కార్మికులకు వేతనాలు ఇచ్చారని, కానీ రామగుండం కార్పొరేషన్‌లో ఇప్పటి వరకు వేతనాలు ఇవ్వలేదని, కార్మికుల పట్ల అధికారులకు ఎంత నిర్లక్ష్యం ఉందో అర్థమవుతుందన్నారు. మోదీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను లేబర్ కోడ్‌లను అమలులోకి తేవడానికి ప్రయత్నాలు చేస్తున్నారని, ఏప్రిల్ 1 నుంచి వీటిని అమలు చేయడానికి అధికార యంత్రాంగం ప్రయత్నిస్తుందని, ఈ ప్రయత్నాలను కార్మికులు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు వై యాకయ్య, జనగామ రాయమల్లు, కుమారస్వామి, కిషన్‌నాయక్, మంథని లింగయ్య, నాగమణి, సునీత, రామలక్ష్మి, పోషమ్మ, లత, లక్ష్మి, రాజేందర్, రవీందర్‌తో పాటు 300మంది పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ట్రినిటి ఇంజనీరింగ్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే


ట్రినిటి గ్రాడ్యుయేషన్ డే లో పట్టా అందిస్తున్న చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): దేశభవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని ట్రినిటి విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన పట్టభద్రుల దినోత్సవంలో జేఎన్టీయూ కళాశాల హైదరాబాద్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగ అధిపతి డాక్టర్ ఉమారాణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు సమర్థవంతమైన సూచనలు, సలహాలు అందించారు. ఇంజనీరింగ్ పూర్తిచేసిన యువత దేశం కోసం పనిచేయాలన్నారు. భవిష్యత్తులో అవకాశాలు మరింత మెరుగుపడతాయని వాటిని అందిపుచ్చుకోవాలన్నారు. ఏపనిచేసిన సమర్థత కీలకమని, మీలాంటి యువత నాయకత్వం వహించి దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. జీవితం పరుగుపందెం లాంటిదని పడిలేచే కెరటాన్ని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు, వెండి పతకాలు ప్రదానం చేశారు. ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ మణిగణేష్, ఈవో సురేష్, చొప్పరి వంశీ, డాక్టర్ నటరాజన్, డాక్టర్ ఆరీఫ్, స్వాతి, ప్రభాకర్, డాక్టర్ రామ్మోహన్, డాక్టర్ అంబికా తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల పదవీ కాలం పొడిగింపు

(5వ పేజీ తరువాయి)

పాలక వర్గాల పదవీ కాలాన్ని ఆరు మాసాల పాటు పొడిగించడంపై కాంగ్రెస్ వర్గాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న సహకార సంఘాల చైర్మన్లు, డీసీసీబీల చైర్మన్లు బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారే ఎక్కువగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలన తీసుక వస్తుందని భావించిన కాంగ్రెస్ నాయకులు పొడిగింపుతో ఒక్కసారిగా కంగుతిన్నారు. కొంత మంది చైర్మన్లు కాంగ్రెస్ పార్టీలో చేరినప్పటికీ, ఆ పదవులపై ఆశలు పెంచుకున్న కాం గ్రెస్ పార్టీకి చెందిన నాయకులు డీలా పడుతున్నారు. సహకార సంఘాల ద్వారా రైతులకు ఎరువులను విక్రయిస్తుండడంతో పాటు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ యాసంగిలో రాష్ట్ర వ్యాప్తంగా గతంలో కంటే సాగు విస్తీర్ణం పెరిగింది. సంఘాల్లో సరిపడా యూరియా ఉన్నప్పటికీ, ఇటీవల పలు సంఘాల వద్ద రైతులు బారులు తీరుతున్నారు. ఇదంతా బీఆర్ఎస్ పార్టీకి చెందిన చైర్మన్లు ప్రభుత్వాన్ని బదనాం చేసేందుకే యూరియా కొరత లేకున్నా, ఉన్నట్లు రైతుల్లో అయోమయం సృష్టిస్తున్నారని కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు అంటున్నారు. ఈ తరుణంలో సహకార సంఘాల పదవీ కాలాన్ని పొడిగించడంపై గుస్సాగా ఉన్నారు.

బీఆర్ఎస్ శ్రేణులు మొక్కలు నాటాలి


మొక్కను నాటుతున్న మాజీ ఎమ్మెల్యే

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టినరోజు ఈనెల 17న ప్రతీ కార్యకర్త మొక్కలు నాటాలని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో మొక్కలు నాటి వేడుకలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కేసీఆర్ ముందస్తు జన్మదిన వేడుకలను జిల్లా పార్టీ కార్యాలయంలో మొక్కలు నాటి నిర్వహించామన్నారు. జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్, మాజీ ఎంపీపీ బాలాజీ రావు, నాయకులు ఉప్పు రాజ్ కుమార్, రవీందర్, శ్రీనివాస్, పల్లె మధు, నిఖిల్ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో పేరెంట్స్ మీటింగ్

సుల్తానాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): గర్రెపల్లి మోడల్ స్కూల్‌లో శనివారం తల్లిదండ్రుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రతీ మూడో శనివారం పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహిస్తామని ప్రతీ సబ్జెక్టును సమీక్షిస్తూ ఆ విషయాలను తల్లిదండ్రులకు చెప్పి ముఖాముఖి చర్చ కొనసాగిస్తామని ఇంచార్జి ప్రిన్సిపాల్ కొండయ్య తెలిపారు. స్కాలర్‌షిప్ సాధించిన నలుగురు విద్యార్థుల తల్లిదండ్రులను ఇంచార్జి ప్రిన్సిపాల్ కొండయ్య సన్మానించారు.

ఖని పాత్రికేయుడి కుటుంబానికి సహాయం

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఒకేవారంలో తల్లిదండ్రులను కోల్పోయిన గోదావరిఖనికి చెందిన ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయుడు ఆకునూరి రమేష్ కుటుంబానికి వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వ్యాళ్ళ హరీష్‌రెడ్డి రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆకునూరి లక్ష్మీ-దుర్గయ్యలు వారంలో అనారోగ్యంతో మరణించిన విషయాన్ని హరీష్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. శనివారం వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ రామగుండం నియోజకవర్గ ఇంచార్జి సిగిరి రాము, సభ్యుల చేతుల మీదుగా రమేష్‌కు అందించారు. పాత్రికేయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఆరోగ్యంగా, శారీరక దృఢత్వంగా ఉండాలని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యాసంస్థల డైరెక్టర్ మంజులశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మార్కండేయకాలనీలోని కృష్ణవేణి స్కూల్‌లో హెల్త్ చెకప్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె హాజరై మాట్లాడుతూ రోజు వ్యాయామం చేసి ఆరోగ్యంగా ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ రామకృష్ణ, సత్యనారాయణ, శైలజ, రాజిరెడ్డి, ఉపాధ్యాయులు, పోషకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత

ముత్తారం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన సొల్లు సాత్విక్ కు రూ.2.50 లక్షల ఎల్‌ఓసిని శనివారం మంజూరు చేశారు. సాత్విక్ అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చేరగా ఖర్చుల కోసం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు కుటుంబ సభ్యులు తెలిపారు. హైదరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎల్‌వోసీ అందజేశారు.

ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి

పాలకుర్తి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): సంత్ సేవాలాల్ జయంతిని శనివారం బామ్లానాయక్ తండా గ్రామపంచాయతీలో నిర్వహించారు. మాజీ సర్పంచ్ బదావత్ రాజునాయక్ ఆధ్వర్యంలో సంత్‌లాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బయ్యపు మనోహర్‌రెడ్డి, బదావత్ సారయ్య, ఇస్లావత్ సమ్మయ్య, లాల్ సింగ్, తిరుపతి నాయక్ బూక్య రాజు నాయక్ పాల్గొన్నారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): సేవాలాల్ జయతిని నిర్వహించారు. గుండేటి ఐలయ్య యాదవ్, గుగులోత్ పర్శా నాయక్, సేవినాయక్, లక్ష్మణ్, స్వామి, రాజు, భానోత్ తుకారం, గూగులోత్ కుమార్, సంజయ్, భానోత్ రాజకుమార్, రాము నాయక్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు

అంతర్గాం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు జరిపిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ తూము రవీందర్ పటేల్ అన్నారు. శనివారం మద్దిర్యాలలో ఓ కుటుంబం బాలికకు వివాహం జరిపిస్తున్నారనే సమాచారం మేరకు తల్లిదండ్రులకు, బాలికకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ నెల 10న బాల్య వివాహం సమాచారం అందుకున్న చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రతినిధులు, ఐసీడీఎస్ అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. మళ్ళీ బాలికకు వివాహం జరుపడానికి సిద్ధం కాగా సమాచారం అందుకున్న తహసీల్దార్ బాలిక కుటుంబ సభ్యులను కార్యాలయానికి పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్‌ఐ వెంకట స్వామి, అంగన్‌వాడీ సూపర్ వైజర్ అంజలి, కనుకయ్య,శ్రీనివాస్, సంతోష్, కవిత పాల్గొన్నారు.

ఓటర్ల తుది జాబితా విడుదల

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 30 గ్రామాల్లో 17 ఎంపీటీసీ స్థానాలు, జడ్పీటీసీ స్థానానికి శనివారం మండల పరిషత్ కార్యాలయం సూపరింటెండెంట్ రవి కుమార్ తుదిజాబితాను విడుదల చేశారు. 92 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 50994 ఓటర్లు ఉన్నట్లు ప్రకటించారు. తుదిజాబితా నమూనాను ఎంపీడీవో కార్యాలయం ఎదుట ప్రదర్శించారు. సీనియర్ అసిస్టెంట్ రమణ, ఏపీవో రమేష్‌బాబు, సిబ్బంది ప్రశాంత్, శ్రీరామ్, రవిందర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): మండలంలో ఓటర్ల జాబితాను విడుదల చేశారు. మండలంలోని ఓటర్లు 38192లు 13 ఎంపీటీసీ స్థానాలకు, 64 పోలింగ్‌స్టేషన్ నోటిఫికేషన్‌ను ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శైలజారాణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

మంథని/మంథనిరూరల్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని 32 గ్రామ పంచాయతీలు, 11 ఎంపీటీసీ స్థానాల ఓటరు జాబితా విడుదల చేశారు. మండలంలో 38,690 మంది జనాభా ఉండగా వీరిలో 34,750 మందితో ఓటరు జాబితాలను సిద్ధం చేశారు. కన్నాల ఎంపీటీసీ స్థానంలో ఓటర్ల సంఖ్య తగ్గడంతో గతంలో ఉప్పట్ల ఎంపీటీసీ పరిధిలో ఉన్న మల్లెపల్లి గ్రామ పంచాయతీ ని కన్నాల ఎంపీటీసీ పరిధిలోకి మార్చారు. ఎంపీటీసీ స్థానాలు ఖరారు చేస్తూ ఓటర్ల సమాచారాన్ని మండల పరిషత్ కార్యాలయం వద్ద నోటీస్ బోర్డు పై అంటించారు.

సంఘాల సేవలు గుర్తించే పొడిగింపు




సుల్తానాబాద్‌లో మాట్లాడుతున్న కేడీసీసీబీ డైరెక్టర్లు, సింగిల్ విండో చైర్మన్లు, ఎలిగేడులో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

సుల్తానాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సంఘాల సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం పాలకవర్గాల గడువును ఆరు నెలలు పొడిగించిందని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ డైరక్టర్లు శ్రీగిరి శ్రీనివాస్, దేవరనేని మోహన్‌రావు, పలువురు సింగిల్ విండో చైర్మన్లు అన్నా రు. సుల్తానాబాద్ సహకార సంఘ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులకు అన్ని రకాల రుణాలతోపాటు వారికి అనేక సేవలను అందుబాటులోకి తెచ్చామని, సంఘాల ఆర్థిక చేయూతకు వివిధ వ్యాపారాలు చేసి ఆదాయాన్ని తెచ్చి పెట్టామన్నారు. రుణాలు పొందిన రైతులలో ఎనభై శాతానికి పైగా రుణ మాఫీ వర్తించిందని ఆయా సంఘాల చైర్మన్లు వివరించారు. సంఘాలు ఒకరికి ఒకరు పోటీ పడుతూ అభివృద్ధి కోసం పనిచేశామన్నారు. ఆరు మాసాలు అవకాశం కల్పించినందుకు సీఎం, మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని సింగిల్ విండో చైర్మన్లు విజయభాస్కర్ రెడ్డి, చింతపండు సంపత్, సుమన్ రెడ్డి, శ్రీనివాస్, మోహన్‌రావు సీఈవోలు, డైరక్టర్లు పాల్గొన్నారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో శనివారం పాలకవర్గం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పీఎసీఎస్‌ల పదవీకాలం మరో 6నెలలు పెంచడంపై సంఘంచైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. డైరెక్టర్లు తాటిపల్లి రమేష్‌బాబు, తీగల కనుకయ్య, కొండ తిరుపతిగౌడ్, కరివేద సుధాకర్‌రెడ్డి, తొంటి మధూకర్, ఏలేటి వెంకట్‌రెడ్డి, రెవెల్లి కనుకమ్మ, కమలమ్మ, రవి, దుగ్యాల రాజేశ్వర్‌రావు, దాసరి రాజిరెడ్డి, సీఈవో విక్రమ్ సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల తయారీపై దృష్టి సారించాలి

ఎలిగేడు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువుల తయారీపై అధికారులు దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య సూచించారు. శనివారం ఎలిగేడులోని సెగ్రిగేషన్ షెడ్డు, సామాజిక వనసర్సరీనీ పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఎలిగేడు, జూలపల్లి మండలాలకు చెందిన కార్యదర్శులు, ఆపరేటర్‌లతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ నిధులు వెచ్చించి జిల్లా వ్యాప్తంగా రైతుల ప్రయోజనార్థం సెగ్రిగేషన్ షెడ్లను నిర్మించామని వాటిలో తడిపొడి చెత్తను వేరుచేసి సేంద్రియ ఎరువు తయారవుతుందని తెలిపారు. రైతులు పంటపొలాల్లో వినియోగించుకుంటే ఆశించిన దిగుబడులు వస్తాయని పేర్కొన్నారు. పారిశుధ్య పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ, ఎంపీవోలను ఆదేశించారు. వంద శాతం ఆస్తి పన్నులు వసూలు చేయాలని, వేసవిలో ప్రజలకు తాగునీరు సమృద్ధిగా అందించాలని పేర్కొన్నారు. ఎంపీడీవోలు భాస్కర్‌రావు, పద్మయ్య, ఎంపీవోలు ఎండి.ఆరీఫ్, అనిల్‌రెడ్డి, కార్యదర్శులు, ఆపరేటర్స్ పాల్గొన్నారు.

20న విద్యుత్ సౌధ ముట్టడి

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల హక్కుల సాధనకు ఈనెల 20 న తెలంగాణ విద్యుత్ సౌధ ముట్టడికి పిలుపునిచినట్లు ఆర్టిజన్ జిల్లా జెఏసీ నాయకులు తెలిపారు. శనివారం ఎస్ ఈ కార్యాలయం వద్ద ముట్టడి పోస్టర్లు ఆవిష్కరించారు. జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మల్ల కిషన్ రెడ్డి, ఎల్లయ్య, వై. రమేష్, బి. శ్రీనివాస్, తిరుపతి, రాజ్ కుమార్, ఈర్ల సదయ్య, దుడపాక ఓదెలు, వేణుగోపాల్, ట్రాన్స్కో రమేష్, రవి పాల్గొన్నారు.

పుస్తకం ఆవిష్కరించిన మంత్రి

మంథని, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎక్లాస్‌పూర్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్)గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ దొమ్మటి రవి రచించిన ద సైన్స్ ఆఫ్ విన్నింగ్ బుక్‌ను రాష్ట్ర టూరిజం, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శనివారం ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పీఈటీ డాక్టర్ రవి రాసిన బుక్ ఆవిష్కరించి అభినందించారు. ప్రెసిడెంట్ ఐఎఫ్‌పీఈఎఫ్‌ఎస్‌ఎస్‌పీ ప్రొ. రాజేష్‌కుమార్, పాలమూరు యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ లక్ష్మీకాంత్‌రాథోడ్, పాల్గొన్నారు.

నేత్ర, శరీర దానాలపై అవగాహన

ఓదెల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శరీర, నేత్ర, అవయ దానాలపై అవగాహన కల్పించారు. గ్రామానికి చెందిన చెరుకు రాజ వీరు అనారోగ్యంతో మృతిచెందగా కుటుంబ సభ్యులు నేత్రాలను దానం చేశారు. శనివారం కుటుంబ సభ్యులను సన్మానించి, ప్రశంస పత్రాన్ని అందజేశారు. శ్రావణ్‌కుమార్, లింగమూర్తి, వాసు, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అగ్రిమెంట్ ఉండగానే క్యాంటీన్ ఖాళీ

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లో క్యాంటీన్ నిర్వహించేందుకు అధికారులు గతేడాది టెండర్ పిలిచారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ సభ్యురాలు బొంతు తార లక్ష్మీ క్యాంటీన్‌ను దక్కించుకుంది. టెండర్ అగ్రిమెంట్ మూడేళ్ళ పాటు 2027 వరకు ఉంది. ఇటీవల అధికారులు ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేశారు. దీంతో ఆమె న్యాయవాది ఠాగూర్ హన్మాన్‌సింగ్ ద్వారా కలెక్టర్, ఏవోలను జత చేస్తూ నోటీసు చేశారు. నిబంధ నలు విరుద్ధంగా ఖాళీ చేయించడం వల్ల తార లక్ష్మీ అప్పులు తీర్చలేని పరిస్థితి ఏర్ప డుతుందని నోటీసులో పేర్కొన్నారు. అయినప్పటికి మార్పు రాకపోవడంతో కలెక్టర్ ఏవోలపై సివిల్ దావా వేశారు. ఈ నెల 11 కోర్టులో హాజరు కావాలని సమన్లు జారీ అయ్యాయి. అయినా హాజరుకాలేదు. శనివా రం ఉదయం క్యాంటీన్ తెరిచేందుకు తారలక్ష్మీ వెళ్ళగా తాళం పగుల గొట్టి సామాగ్రి ఇన్‌వార్డు సెక్షన్‌లోకి తరలించారు. అనంతరం ఆ గదికి వేరే తాళం వేసి ఉంది. దీంతో తార పోలీసులకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

రైతు భరోసా నిధుల్లో కోత

జూలపల్లి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): రైతుభరోసాలో నిధుల కోతతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. సర్వే చేయించిన ప్రభుత్వం కొందరు రైతుల సాగువిస్తీర్ణాన్ని తక్కువ చూపించడంతో డబ్బులు తక్కువగా వచ్చాయని రైతులు ఆరోపిస్తున్నారు. వడుకాపూర్ వ్యవసాయ విస్తరణ అదికారి రాకేష్‌ను వివరణ తమ తప్పేమి లేదన్నారు.

జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో శనివారం ఫారాన్ కాంప్లెక్స్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. జమాతే ఇస్లామీ హింద్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ జావీద్, లయన్స్ క్లబ్ విజన్ కేర్ అధ్యక్షుడు పూదరి దత్తాగౌడ్ సహకారంతో ఫార్చున్ మెడ్ కేర్, న్యూ పల్స్ ఆసుపత్రి, శరత్ మ్యాక్సీ విజన్ వారి సౌజన్యం నిర్వహించారు. కార్డియాలజిస్ట్, జనరల్, ఆర్థో, కంటి పరీక్షలు, డెంటల్, పిల్లలు, గైనకాలజిస్ట్ విభాగాల్లో మొత్తం సుమారు 450 మందికి పరీక్షలు చేశారు. ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పాల్గొని పరీక్షలు చేయించకున్నారు. శిబిరాన్ని ఏర్పాటు చేసిన సభ్యులను అభినందించారు.ఈ మాజీ జడ్పీటీసీ గోపగోని సారయ్య గౌడ్, సయ్యద్ మస్రత్, మొహమ్మద్ ఖాలీమోద్దీన్, జావీద్ అలీ అజ్మీ, డాక్టర్ల బృందం డా.జునైద్ పిల్లల వైద్య నిపుణులు,డా.రుహి,డా.అహాద్,డా.రాజ్ కుమార్, ఫార్చ్యూన్ మెడ్ కేర్ ఆసుపత్రి క్యాంపు ఇంచార్జి గజవెల్లి గణేష్ పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌ఎఫ్ ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులకు అవార్డుల ప్రదానం

పెద్దపల్లికల్చరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసరామనుజన్ ఫౌండేషన్ ఇటీవల నిర్వహించిన ఒలింపియాడ్‌లో పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్‌కు చెందిన భూక్య జశ్వంత్(4వ తరగతి)స్టేట్ 5వ ర్యాంకు, భావన ఆద్య(4వ తరగతి)లు జిల్లా 2వ ర్యాంకులు, జంగపల్లి సాత్విక (8వ తరగతి), ఎ.సాత్విక్ తేజ(6వ తరగతి)లు జిల్లా కన్సోలేషన్ బహు మతులు సాధించినట్లు గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అలెంకి శ్రీనివాస్ తెలిపారు. శనివారం హన్మకొండలోని కాకతీయ యూనివ ర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ తాటికొండ రమేష్, ఎసిపి పింగలి ప్రశాంత్‌రెడ్డి చేతులమీదుగా వీరికి అవార్డులు ప్రదానం చేశారు. కరస్పాండెంట్ రజనీశ్రీనివాస్, ప్రిన్సిపాల్ విజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యవర్గం

రామగిరి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కల్వచర్ల భవన నిర్మాణ కార్మిక సమైఖ్య సంఘం అధ్యక్షుడిగా ఎస్.కె. షరీఫ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు శనివారం కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశానికి జిల్లా అధ్యక్షుడు చిలువేరు స్వామి, మండల అధ్యక్షుడు తొగరి చంద్రయ్యల అధ్యక్షతన కమీటిలో ఉపాధ్యక్షుడిగా బైరి శంకర్, జనరల్‌సెక్రటరీగా కుసుమ సురేష్, కోశాధికారిగా వెంగలి రాములు, గౌరవ అధ్యక్షులుగా పిల్లిమల్లయ్యలను ఎన్నుకున్నారు. సంఘంగా సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.



మహిళా ఉద్యోగులకు కరాటేలో శిక్షణ

గోదావరిఖని, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 జీఎం ఆదేశాల మేరకు జీడీకే11 ఇంక్లైన్‌లో శనివారం మహిళా ఉద్యోగులకు స్వీయ రక్షణ కోసం కరాటేలో శిక్షణ తరగతులను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్ఓటూ జీఎం గోపాల్‌సింగ్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జీడీకే 11 ఇంక్లైన్‌లో పనిచేస్తున్న 27మంది మహిళ ఉద్యోగులు భూగర్భ గనిలో, వివిధ హోదాలో పని చేస్తున్నారని, పని చేసే స్థలంలో వీరు మానసిక ఒత్తిడికి గురి కాకుండా స్వీయ రక్షణ ఎంతో అవసరమని, వారిలో మానసిక, శారీరక దారుఢ్యం పెంపొందించుటకు ఈ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. గ్రూప్ ఏజెంట్ చిలక శ్రీనివాస్, ఎన్విరాన్ మెంట్ అధికారి ఆంజనేయ ప్రసాద్, మేనేజర్ బీ మల్లేశం, సేఫ్టీ అధికారి మెరుపురి మల్లేష్, పిట్ సెక్రటరి రాజు, సంక్షేమ అధికారి రవీందర్, కుంగ్ ఫు మాస్టర్లు రాజేశం, రాములు పాల్గొన్నారు.

బొగ్గు రవాణాలో వేగం పెంచాలి

ఘైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఓసీపీ-3 సీహెచ్‌పీ నుంచి బొగ్గు రవాణాలో వేగం పెంచాలని సింగరేణి డైరెక్టర్ ఆపరేషన్స్ సూర్యనారాయణ ప్రాజెక్టు అధికారులకు సూచించారు. శనివారం ఓసీపీ-3 సీహెచ్‌పీని రైల్వే అధికారులతో కలిసి పరిశీలించారు. బొగ్గు నిల్వలపై సీహెచ్‌పీ అధికారులతో చర్చించారు. సీహెచ్‌పీ నుంచి రైల్వే రేకుల రవాణా పెంచేందుకు అవసరమైన ఏర్పాట్లపై రైల్వే అధికారులతో చర్చించారు. బంకర్లు, సీహెచ్‌పీలో బొగ్గు నిల్వలను పరిశీలించారు. రవాణాకు అనుగుణంగా బొగ్గు నిల్వలను అందుబాటులో ఉండేలా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు. సౌత్ సెంట్రల్ రైల్వే ఏసీఎం సుచరితారెడ్డి, ఏఓ రాజేష్‌మీనా, అఫీషియేటింగ్ జీఎం మధుసూదన్, ఏరియా ఇంజనీర్ నరసింహారావు, సీహెచ్‌పీ ఇంచార్జి సదానందం ఉన్నారు.


సీహెచ్‌పీని పరిశీలిస్తున్న డైరెక్టర్ సూర్యనారాయణ

జీడీకే 1సీ ఎస్‌పీని సందర్శన

గోదావరిఖని (ఆంధ్రజ్యోతి): సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్)గా నియమితులైన ఎల్‌వీ సూర్యనారాయణ శనివారం జీడీకే వన్ సీఎస్‌పీని సందర్శించారు. డైరెక్టర్‌కు ఆర్‌జీ-1 జీఎం డీ లలిత్ కుమార్, రామగుండం రీజియన్ జీఎం(క్వాలిటీ) డీ వైద్య, ఎస్ఓటూ జీఎం గోపాల్‌సింగ్, వీ రమేష్, డీవైఎస్ఈ హరీష్ కుమార్ స్వాగతం పలికారు. జీఎం డీ లలిత్ కుమార్ డైరెక్టర్ పూల కుండి అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జీడీకే వన్ సీఎస్‌పీలో బొగ్గు ఉత్పత్తి, రవాణా వివరాలను వివరించారు. అనంతరం డైరెక్టర్ సీఎస్‌పీలోని సీ1, సీ2, సీ3 తదితర పని ప్రదేశాలను తనిఖీ చేసి సూచనలు అందించారు. నిర్దేశించిన లక్ష్య సాధనకు ఉద్యోగులందరూ సమిష్టిగా కృషి చేసి రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయాలన్నారు. గుర్తింపు సంఘం నాయకులు బండి మల్లేశం, బుడిమ సమ్మయ్య, ఓ. లక్ష్మయ్య, పిట్ కమిటీ, మైన్స్ కమిటీ సభ్యులు, ఐఎన్‌టీయూసీ యూనియన్ నాయకులు బత్తుల పోచయ్య, మల్లికార్జున స్వామి, పుట్ట రమేష్, దామోదర్ పాల్గొన్నారు.